క్లుప్తంగా

నేడు మండల సమావేశం

పోలాకి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఎంపీపీ ముద్దాడ దమయంతి అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఉషశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో అధికారులు, సభ్యులు పాల్గొనాలని కోరారు.

హిందూ ధర్మం గొప్పది



ప్రవచనాలు చెబుతున్న వక్తలు

సారవకోట: హిందూ ధర్మంలో ఉన్న ఆచార, సంప్రదాయాలు గొప్పవని వాటిని, ప్రతి ఒక్కరూ ఆచరించాలని గీతా ప్రచారకులు కంచుమోజు రామ్మోహన్ అన్నారు. సోమవారం శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని కిన్నెరవాడ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో అర్చకులు సిద్ధయ్య స్వామి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. హిందూ ధర్మాన్ని ప్రపంచ దేశాలన్నీ గౌరవిస్తున్నాయన్నారు. దాసరి సత్యనారాయణ, గొలివి మోహన్‌రావు, పిట్ల సోమేశ్వర రావు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు.

విద్యుత్ కనెక్షన్లు ఇప్పించండి

సారవకోట: మండలంలోని బుడితి గ్రామంలో గల జగనన్న కాలనీలో నిర్మించుకున్న గృహాలకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని సోమవారం మండల కేంద్రంలోని గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు. తాము గృహ నిర్మాణాలు పూర్తి చేశామని, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో నివాసం ఉండేందుకు అవకాశం లేకుండా పోతుందని లబ్ధిదారుడు ఎల్.నారాయణరావు, తదితరులు అన్నారు. విద్యుత్ వైర్ పాడైపోయిందని, దీనిని మార్చి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్ ఉన్నారు.

ఆక్రమణదారులకు నోటీసులు

సరుబుజ్జిలి: మండలం కేంద్రంలోని శిమ్మ కోనేరు గట్టుపై తాత్కాలిక నిర్మాణాలు చేసిన ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ ఎల్.మధుసూదన్ సోమవారం తెలిపారు. నోటీసు అందుకున్న పది రోజుల్లోగా ఆక్రమణదారులు ఆ భూమిని ఖాళీ చేయాలన్నారు. లేకపోతే ఆ ప్రదేశంలో ఉన్న కట్టడం, పైరు, ఫలసాయాన్ని తొలగిస్తామని నోటీసులో పేర్కొన్నట్లు వెల్లడించారు.

సృజనాత్మక విద్య అందించాలి



దివ్యాంగ విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి రోషిణి

పాతపట్నం: దివ్యాంగ విద్యార్థులకు సృజనాత్మక విద్య అందించాలని ఉపాధ్యాయులకు పాతపట్నం జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి సూచించారు. స్థానిక భవిత కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు సమస్యలు ఉంటే తల్లిదండ్రులు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.రమణ, ఐఈఆర్ ఉపాధ్యాయులు సుధారాణి, ఇన్నా, సీఆర్టీలు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు



గుంతలను పూడ్చుతున్న దృశ్యం

సరుబుజ్జిలి: తాజాగా మండల సర్వసభ్య సమావేశానికి వచ్చే సమయంలో సరుబుజ్జిలి జంక్షన్ వద్ద గుంతల పూడ్చివేత పనులపై ఆర్ అండ్‌బీ అధికారులపై ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అధికారులు యుద్ధ ప్రాతిపదికన రహదారి మరమ్మతు పనులు ప్రారంభించారు. మురుగునీరు నిల్వ చేరకుండా పైపులు వేశారు. రహదారి గుంతలను క్రషర్ డస్ట్‌తో పూడ్చివేస్తామని ఆర్‌అండ్‌బీ జేఈ ఆంజనేయ నాయక్ తెలిపారు.

30 వరకు గడువు

హిరమండలం: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ద్వారా దూర విద్య పూర్తిచేసినవారు గ్రాడ్యుయేట్, పీజీ పట్టాలు పొందేందుకు దరఖాస్తుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉందని రామేశ్వరి డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ రెడ్డి గోపాలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామేశ్వరి డిగ్రీ కాలేజీకి దూర విద్యాకేంద్రం మంజూరై నాలుగేళ్లు అవుతుందన్నారు. బీఏ, బీకాంలో పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం

కొత్తూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలను ప్రకృతి వ్యవసాయ ఎంటీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంగాకరకాయ, చిక్కుడు, తోట, గొంగూరతో పాటు పలు రకాల కూరగాయలను ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన వాటిని విక్రయించారు.

అనుబంధానికి ప్రతీక రాఖీ



నరసన్నపేట: ఎస్సీ బాలికల వసతి గృహంలో సోదరులకు రాఖీ కడుతున్న సోమదరీమణులు

రాఖీ పౌర్ణమి వేడుకలు సోమవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. సోదర సోదరీమణుల అనుబంధం, అనురాగం, ప్రేమాప్యాయతలకు ప్రతీకగా ఏటా శ్రావణ మాసంలోని పౌర్ణమి తిథి రోజు రాఖీ పండగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ సంబరాలతో పండగ వాతావరణం నెలకొంది. – సాక్షి నెట్‌వర్క్



ఎల్.ఎన్.పేట: ఎమ్మెల్సీ విక్రాంత్‌కు రాఖీ కడుతున్న సోదరి, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



నరసన్నపేట: దేశవానిపేట బీసీ బాలికల వసతి గృహంలో సోదరులకు రాఖీ కట్టి హారతి ఇస్తున్న చెల్లెళ్లు



మెళియాపుట్టి: పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు రాఖీ కడుతున్న మహిళలు



పొందూరు: పోలీసులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు



పాతపట్నం: మోడల్ స్కూల్ వద్ద చెట్టుకు రాఖీ కడుతున్న ఉపాధ్యాయులు



సరుబుజ్జిలి: సరుబుజ్జిలి జెడ్పీహెచ్‌ఎస్‌లో రక్షాబంధన్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



పోలాకి: మబగాంలో మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు



పాతపట్నం: సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి

ఉపాధ్యాయుల నిరసన

హిరమండలం: ఉపాధ్యాయుల సర్దుబాటును వ్యతిరేకిస్తూ మండలంలోని పలు సంఘాలకు చెందిన ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. ఫ్యాప్టో సంఘం పిలుపుమేరకు ఉపాధ్యాయులు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ పని సర్దుబాటులో భాగంగా కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులను విభజన చేస్తున్నారన్నారు. ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శాంతారామ్, దివాకర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: విద్యారంగానికి తీవ్ర నష్టం కలిగించేలా ప్రభుత్వం చేపడుతున్న ఉపాధ్యాయుల పని సర్దుబాటును వ్యతిరేకిస్తూ సోమవారం ఐక్య ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు నిరసన తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఎమ్మార్సీ కార్యాలయంలో జరిగిన పని సర్దుబాటు కార్యక్రమాన్ని ఐక్య ఉపాధ్యాయల సంఘాలు బహిష్కరించాయి. ఎంఈఓలు పీవీ రామరాజు, పట్నాన రాజారావుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు మొగదాల రమణరావు, తేజేశ్వరరావు, జి.గోపాలరావు, కేవీవీఎం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని జిల్లా ఉపాధ్యాయ



పొందూరు: ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు



ఆమదాలవలస: డిమాండ్ నోటీస్ అందజేస్తున్న ఉపాధ్యాయులు



హిరమండలం: నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

సంఘం ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎంఈఓ కార్యాలయంలో జరగాల్సిన ఉపాధ్యాయుల పని సర్దుబాటు మీటింగ్‌ను వివిధ సంఘాలకు చెందిన ఉపాధ్యాయులు, సంఘ నాయకులు బహిష్కరిస్తూ కార్యాలయ సిబ్బందికి డిమాండ్ నోటీసును అందించారు. నిబంధలనకు వ్యతిరేకంగా పని సర్దుబాటు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని సర్దుబాటుకు ముందు ఉద్యోగోన్నతలు కల్పించాలని, రోల్స్‌తో నిమిత్తం లేకుండా యూపీ స్కూళ్లకు ఐదుగురు ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్, యూటీఎఫ్, పీఆర్‌టీయూ, టీఎన్‌యూఎస్ తదితర సంఘాలకు చెందిన నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి

నరసన్నపేట: ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తామని కేంద్ర పౌరవిమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు అన్నారు. ప్రపంచ ఫొటో గ్రాఫర్ల దినోత్సవం సందర్భంగా నరసన్నపేట ఫొటో గ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. లూయిస్ డాగ్యురే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ఫొటోగ్రాఫర్ల కృషిని అభినందించారు. జ్ఞాపకాలను పదిలంగా ఉంచేవి ఫొటోలేనని అన్నారు. ఫొటో గ్రాఫర్ల సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, నరసన్నపేట ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, ఫొటోగ్రాఫర్ల సంఘం నరసన్నపేట ప్రతినిధి పీఎస్ ప్రసాద్, గోపీ, ధర్మాన కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



లూయిస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామ్మోహన్నాయుడు

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

పాతపట్నం: స్థానిక ఆస్పత్రి కూడలి వద్ద పాతపట్నం నియోజకవర్గ ఫొటో గ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు తూలుగు భుజంగరావు ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రఫీని అభివృద్ధి చేసిన లూయిస్ డాగ్యురే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ కెమెరా సృష్టించడానికి డాగ్యురే చేసిన కృషి వల్లే ఇప్పుడు ఫొటో గ్రాఫర్లు తమ జీవితాలను కొనసాగిస్తున్నారన్నారు. ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పి.రాము, ఎస్.మరణ, టి.వెంకటరావు, గోపీకృష్ణ పట్నాయక్, ఎస్.జోగారావు, బి.మధు, ఖగేష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నం: లూయిస్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సంఘం సభ్యులు

అంగన్‌వాడీ కార్యకర్త మృతి

పొందూరు: మండలంలోని వీఆర్‌గూడెం అంగన్‌వాడీ కార్యకర్త కె.స్వప్న (25) శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మృతురాలు ఐదు నెలల గర్భిణి. గర్భస్థ శిశువు పెరుగుదలలో లోపం తలెత్తడంతో ఆమె అనారోగ్యానికి గురైంది. శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పిండాన్ని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధిక రక్తస్రావం జరిగి చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త అసిరినాయుడు, రెండేళ్ల పాప ఉన్నారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.



కె.స్వప్న (ఫైల్)

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఎల్.ఎన్.పేట: మండలంలోని గార్లపాడు (తాయి మాంబాపురం) వంశధార పునరావాస కాలనీలోని సంతోషిమాత ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఖీ పండగతోపాటు ఆలయ ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా పూజలు నిర్వహించినట్లు గ్రామ పురోహితులు బంగుపల్లి రవిప్రసాద్‌శర్మ తెలిపారు. సంతోషిమాతకు సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు.ఆర్ఆర్ కాలనీతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గ్రామ పెద్దలు, గ్రామస్తుల సహకారంతో అన్నసంతర్పణ చేశామని కమిటీ సభ్యులు తెలిపారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నిరుపేద వధువుకు రూ.లక్ష సాయం

హిరమండలం: నిరుపేద యువతి వివాహానికి పాతపట్నం నియోజకవర్గ జనసేన నాయకుడు కొరికాన రవికుమార్, భవానీ దంపతులు సోమవారం రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. హిరమండలంలోని బ్రాహ్మణ వీధిలో నివాసముంటున్న మించుల నారాయణమ్మ అనే మహిళ భర్త ఇదివరకే మృతి చెందారు. ఇద్దరు కుమార్తెలతో ఆమె ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. పెద్ద కుమార్తెకు వివాహమైంది. రెండో కుమార్తెకు ఇటీవల పెళ్లి నిశ్చయమైంది. పేదరికం కారణంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న రవికుమార్, భవానీ దంపతులు తమ వంతుసాయాన్ని అందించారు. ఎల్.ఆనందరావు క్రాంతికుమార్, మామిడి రామకృష్ణ, వికాస్, హరీష్, జీవన్, నారాయణరావు, ఢిల్లేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న రవికుమార్, తదితరులు

విద్యుత్ వెలుగులు

పాతపట్నం: స్థానిక రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాం అభివృద్ధి పనుల్లో భాగంగా విద్యుత్ లైట్లును ఏర్పాటు చేశారు. ఫ్లాట్ ఫాం ఫ్లోరింగ్ పనులు రెండు రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రతీరోజు పూరి–గుణుపూర్, గుణుపూర్–పూరి, విశాఖపట్నం–గుణుపూర్, గుణుపూర్–విశాఖపట్నం, కటక్–గుణుపూర్, గుణుపూర్–కటక్, గుణుపూర్–పలాస రైళ్లు పాతపట్నం రైల్వేస్టేషన్ మీదుగా ప్రయాణిస్తాయి. గతంలో ప్రయాణికులు రైల్వే స్టేషన్ వద్ద ఉండడానికి సదుపాయం లేక ఇబ్బంది పడేవారు. రాత్రి సమయంలో లైట్లు, కూర్చోడానికి కుర్చీలు లేవు. పాతపట్నం, టెక్కలి రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులను రూ.1.20 కోట్లతో చేపడుతున్నారు. స్టేషన్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సారవకోట: మండలంలోని తొగిరి ఎత్తిపోతల పథకానికి ధర్మాన తేజ్‌కుమార్ తన సొంత నిధులతో తాత్కాలికంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. ఈ పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ గత కొంత కాలం క్రితం చోరీకి గురైంది. అప్పటినుంచి ట్రాన్స్‌ఫార్మర్ కొత్తది ఏర్పాటు చేయడం గానీ, దీనిని మరమ్మతు చేయడం కానీ జరగలేదు. ఈ సమస్యను తేజ్‌కుమార్ దృష్టికి స్థానిక రైతులు తీసుకెళ్లారు. రూ.లక్ష సొంత నిధులు వెచ్చించి విశాఖపట్నం నుంచి అద్దెకు ట్రాన్స్‌ఫార్మర్ తెప్పించి సోమవారం ఏర్పాటు చేయించారు. శాశ్వత పరిష్కారం కోసం మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి దృష్టికి తీసుకెళ్తానని తేజ్‌కుమార్ తెలియజేశారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

రూ.20 వేల ఆర్థికసాయం

కొత్తూరు: మండలంలోని గురండి గ్రామానికి చెందిన గువ్వాడ కృష్ణవేణి (బాలింత) కిడ్నీ వ్యాధితో బాధపడుతుంది. ఎనిమిది నెలలకే డెలివరీ కావడంతో శిశువు ఆరోగ్య పరిస్థితి కూడా బాగులేదు. నిరుపేద కుటుంబానికి చెందిన కృష్ణవేణికి వైద్యం ఖర్చుల నిమిత్తం కొత్తూరుకు చెందిన భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు రూ.20 వేలను సోమవారం గ్రామానికి వెళ్లి అందజేశారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో కమ్యూనికేషన్స్ డీఐజీ

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగేశ్వరుడిని కమ్యూనికేషన్స్ డీఐజీ ఎస్.జె.లక్ష్మి కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. గోలెం చరిత్ర, ఆలయ విశేషాల ను అర్చకులు వివరించారు. స్వామివారి శేష వస్త్రా లు, ప్రసాదం అందించి దీవించారు.

ప్రత్యేక పూజలు..

శ్రీముఖలింగంలో శ్రావణ మాసం సోమవారం స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలలతోపాటు తెలంగాణ, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



స్వామివారి సన్నిధిలో డీఐజీ కుటుంబ సభ్యులు

అంధకారంలో గోనెపాడు

సరుబుజ్జిలి: గోనెపాడులో గత పది రోజులుగా విద్యుత్ దీపాలు పనిచేయడం లేదని సర్పంచ్ బిర్లంగి అమ్మాయమ్మ తెలిపారు. విద్యుత్ బల్బులు తమ పంచాయతీ కార్యాలయంలో సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎనర్జీ అసిస్టెంట్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కనీసం వారంలో ఒక్కరోజు కూడా గ్రామంలోకి ఎనర్జీ అసిస్టెంట్ రావడంలేదన్నారు. విద్యుత్ దీపాలు లేకపోవడం వల్ల వర్షాల సీజన్ కావడంతో విష జంతువుల తాకిడి అధికంగా ఉంటుందన్నారు. దీనివల్ల గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు వీధిలోకి అడుగుపెట్టడానకి భయపడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని సర్పంచ్ కోరారు.



వెలగని విద్యుత్ బల్బు

అమ్మ ఒడి పేరు తొలగించలేదని ఆగ్రహం

ఆమదాలవలస: మండలంలోని తొగవలస వద్ద గల కస్తూర్బా గాంధీ విద్యాలయం గోడపై జగనన్న అమ్మ ఒడి పథకానికి సంబంధించిన రాతలు ఉన్నాయి. పాఠశాలలో ఇటీవల జరిగిన సమావేశానికి ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ హాజరయ్యారు. ఆయన వెంట వెళ్లిన కొంతమంది టీడీపీ నాయకులు గోడపై రాతలు చూసి ఎస్ఓ పి.శిరీషపై ఆగ్రహం వ్యక్త చేసినట్లు సమాచారం. దీంతో ఆమె స్పందించి ఆ రాతలపై గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ ఫ్లెక్సీని అతికించారు. ఎమ్మెల్యే హాజరుకాక ముందే ఈ విషయాన్ని టీడీపీ నాయకులు రభస చేయడంతో ఆ రాతలు మూసివేసినట్లు చర్చించుకుంటున్నారు. తల్లికి వందనంగా మార్చిన పథకానికి ఇంకా జగనన్న అమ్మ ఒడి పథకం పేరు ఉంచడం సమంజసం కాదని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎస్ఓకు టీడీపీ నాయకులు హెచ్చరించినట్లు పాఠశాలలో ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు.



కేజీబీవీలో రాతలు మూవేయిస్తున్న ఎస్ఓ పి.శిరీష, సిబ్బంది

రహదారిపై మట్టిని తొలగించాలి

పాతపట్నం: పాతపట్నం ప్రధాన రహదారిపై ఇరువైపులా ఉన్న ఇసుక, మట్టిని తొలగించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బి.నారాయణమూర్తి అన్నారు. ఈ మేరకు సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఈఓ దిలిప్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పాతపట్నం దుర్గమ్మగుడి, గాంధీ నగర్ వీధుల్లో నిత్యం విద్యుత్ వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయని, విద్యుత్ వృథా అవుతుందన్నారు. ఈఓ స్పందించారని పాతపట్నం ప్రధాన రహదారి జాతీయ రహదారి కావడం వల్ల తన పరిధిలో లేదని, జాతీయ రహదారుల ఉన్నాధికారులకు తెలియజేసి ఇసుక, మట్టిని తొలగిస్తామని ఈఓ హామీ ఇచ్చారన్నారు.



ఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నారాయణమూర్తి